శంకర్‌గౌడ్‌కు ఆర్మీ అధికారుల ప్రశంస

● సైనికుడ్ని కాపాడేందుకు ప్రయత్నించినందుకు అభినందన


శంకర్ గౌడ్‌ను సత్కరిస్తున్న ఆర్మీ అధికారులు

ఎల్‌బీనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల లంగర్ హౌస్ వంతెనపై చైనా మాంజాతో తీవ్ర గాయాలై రక్తస్రావంతో రహదారిపై పడి ఉన్న సైనికుడు కోటేశ్వర్ రెడ్డిని కాపాడేందుకు ప్రయత్నించిన గడ్డం శంకర్‌గౌడ్‌ను సైనికాధికారు లు సరూర్‌నగర్‌లోని కామేశ్వర్‌నగర్‌లో అభినందించి జ్ఞాపిక అందజేశారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలం విట్టాపూర్‌కు చెందిన శంకర్ గౌడ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ సరూర్‌నగర్‌లో కుటుంబతో నివాసముంటున్నాడు. ఇటీవల సైనికుడు కోటేశ్వర్ రెడ్డి విధులకు వెళ్తుండగా చైనా మాంజా మెడకు చుట్టుకుని తీవ్ర రక్తస్రావంతో కనిపించాడు. అదే మార్గంలో వెళ్తున్న శంకర్‌గౌడ్ గమనించాడు. ఓ మహిళ చున్నీ ఇవ్వగా రక్తస్రావాన్ని ఆపేందుకు కట్టుకట్టాడు. అనంతరం వాహనంలో సైనిక ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు ఎంతగా ప్రయత్నించినా కోటేశ్వర్ రెడ్డి ప్రాణాలు దక్కలేదు. సైనికుడి ప్రాణాలు కాపాడేందుకు చేసిన సేవలను గుర్తించిన శంకర్‌గౌడ్‌ను సైనికాధికారులు కల్నల్ బాలకృష్ణన్, ఎంకే.నాయక్, జయరాంలు అభినందించారు.

అవయవ దానం


శంకర్(ఫైల్)

రాంగోపాల్‌పేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్ద మరణించి పుట్టెడు దుఖంలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎందరికో ఆదర్శప్రాయమైంది. హైదరాబాద్ టికెగూడకు చెందిన అన్నారపు శంకర్(61) అనారోగ్యంతో స్పృహ తప్పి పడిపోవడంతో స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డకట్టిందని వైద్య పరీక్షల్లో గుర్తించిన వైద్యులు రెండు రోజులు శ్రమించి వైద్యం చేసినప్పటికీ గురువారం శంకర్ బ్రెయిన్ డెడ్ అయ్యి మృతిచెందాడు. అనంతరం అవయవ దానం గురించి మృతుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు ఆస్పత్రిలోని అవయవదాన సమన్వయ కర్తలు అవగాహన కల్పించారు. దీంతో శంకర్ భార్య లలిత, నలుగురు కూతుర్లు, ఇద్దరు కుమారుల అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలను దానం చేశారు. అనంతరం జీవన్‌దాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానల్ ద్వారా అవసరం ఉన్న చోటికి ఆ అవయవాలను తరలించారు.

నేడు గిరిజన సంస్కృతి పరిరక్షణపై సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆద్యకళ మ్యూజియం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10గంటలకు నాంపల్లి, తెలుగు వర్సిటీలోని సమావేశ మందిరంలో 'జానపద, గిరిజన కళలు, సంస్కృతి-అధ్యయనం-పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఆచార్య జయధీర్ తిరుమలరావు తెలిపారు. సదస్సులో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే.శ్రీనివాస్ పాల్గొననున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

హెచ్‌సీయూలో కులగణన.. సామాజిక న్యాయంపై సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రేపటి నుంచి రెండు రోజుల పాటు(శుక్రవారం, శనివారం) కులగణన-సామాజిక న్యాయం అంశంపై ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు. సదస్సులో విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ ప్రముఖులు సామాజిక కార్యకర్తలను ఒక తాటి పైకి తీసుకువచ్చి కులగణనపై ఉన్న అనేక అంశాలు, సందేశాలను చర్చించడం జరుగుతుందని కార్యనిర్వాహకులు, ఏఐఓబీఎస్‌ఏ జాతీయ అధ్యక్షులు జీ.కిరణ్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జరగబోతున్న సెమినార్‌లో ప్రముఖ విధాన రూపకర్త శ్యాం పిట్రోడా, ద్రవిడ కళగం కార్యదర్శి కే.వీరమణి, డీఎంకె రాజ్యసభ సభ్యుడు పీ.విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ ఈవెంకటేశు, ఆళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొంటున్నారని నిర్వాహకులు, ఏఐఓబీఎస్‌ఏ జాతీయ కార్యదర్శి ఎన్.సాయికిరణ్, కొండల్ ఓర్సు తెలిపారు.

ప్రమాదకర మత్తు ఇంజక్షన్లు

● పోలీసుల దాడుల్లో స్వాధీనం ● కువైట్ పారిపోయిన డాక్టర్

రాజేంద్రనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నార్కొటిక్ బ్యూరో, రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు గురువారం సంయుక్తంగా ఆసిఫ్‌నగర్‌లోని ఓ ఇంటిపై దాడులు నిర్వహించి అధిక మత్తునిచ్చే 57 ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ ఓ ఆస్పత్రిలో అనస్థీషియన్. సర్జరీల సందర్భంగా మత్తు కోసం ఇచ్చే ఫెంటానిల్ మత్తు ఇంజక్షన్‌లను బయట మార్కెట్‌లో రూ.17,500కు విక్రయిస్తున్నాడు. ఇవి హెరాయిన్ కంటే 50 శాతం ఎక్కువ, మార్ఫిన్ కంటే మరింత ఎక్కువ ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. యాప్ ద్వారా బయట వ్యక్తులకు డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు నిఘా పెట్టారు. ప్రతీ రోజు ఓ డెలివరీ యాప్ పార్సిల్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గురువారం అతడి ఇంటిపై దాడి చేయగా డాక్టర్ కువైట్ పారిపోయినట్లు గుర్తించారు. అతడి భార్య లుబ్నా నజీబ్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 57మత్తు ఇంజక్షన్లు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 6లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ వస్తే అతడు ఎవరెవరికి మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నాడనే వివరాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.


హబ్సిగూడ- ఉప్పల్ మధ్య మెట్రో రైల్లో గురువారం అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ చేస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మల్కా కొమరయ్య
- ఉప్పల్, (ఆంధ్రజ్యోతి)

ప్రేమను నిరాకరించిందని.. బాలికపై బాలుడి దాడి

● అడ్డుకోబోయిన బాలిక సోదరికి గాయాలు

అంబర్‌పేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తన ప్రేమను తిరస్కరించిందన్న కోపంతో ఓ బాలికపై బాలుడు దాడి చేశాడు. బాగ్‌అంబర్‌పేటకు చెందిన బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతంలో ఉంటున్న బాలుడు కూడా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరూ 10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. కొంతకాలంగా బాలుడు ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో బాలిక ఇంటికి వెళ్లిన బాలుడు ఆమెతో మాట్లాడడానికి ప్రయత్నించగా నిరాకరించింది. దీంతో ఆగ్రహం చెందిన బాలుడు ఇంట్లో కూరగాయలు కోసే కత్తితో బాలికపై దాడికి పాల్పడగా కాలికి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న బాలిక సోదరి అడ్డుకోబోగా బాలుడు ఆమె పొట్టలో పొడిచాడు. గాయపడ్డ ఇద్దరు బాలికలను స్థానికులు ఆంధ్ర మహిళా సభ ఆస్పత్రికి తరలించారు. వారికి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు. సంఘటనా స్థలాన్ని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ సందర్శించారు. బాలుడిపై హత్యాయత్నం, పోక్సో కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అంబర్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊరెళ్లొచ్చే సరికి చోరీ

బంజారాహిల్స్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఊరెళ్లొచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 ఎన్‌బీటీనగర్‌లో నివాసముండే రాంపల్లి లక్ష్మన్ కంసాలి కుటుంబ సభ్యులతో కోయంబత్తూరు వెళ్లి ఈ నెల 17న తిరిగి వచ్చారు. ఇంట్లో బీరువా తెరిచి ఉండడం.. అందులో రూ.75 వేలు విలువ చేసే బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీడియోలకు లైక్ కొడితే.. డబ్బులు ఇస్తామని మోసం

బంజారాహిల్స్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్‌లో వీడియోలకు లైక్ కొడితే డబ్బులు ఇస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు మహిళ వద్ద రూ. 42 వేలు వసూలు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెం.12 ఇన్‌కంటాక్స్ కాలనీలో నివసిస్తున్న ఆవుల మౌనిక ఇన్‌స్టాగ్రాంలో వీడియోలను లైక్ చేస్తే డబ్బులు వస్తాయనే ప్రకటన చూసింది. వెంటనే అందులో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేసింది. కొన్ని వీడియోలకు లైక్ చేయగా రెండు వందల రూపాయలు వచ్చాయి. ఈ తర్వాత సాయి మురుగన్ అనే సైబర్ నేరగాడు ఫోన్ చేసి వెయ్యి రూపాయలు డిపాజిట్ చేస్తే అదనపు బోనస్ వస్తుందని చెప్పాడు. ఇలా పలుమార్లు ఆమె నుంచి రూ. 42 వేలు వసూలు చేశారు. ఎంతకీ డబ్బు రాకపోవడంతో తాను కట్టిన మొత్తం ఇచ్చేయాలని ఆమె నిలదీసింది. దీంతో అతను ఫోన్ బ్లాక్ చేశాడు. మోసపోయినట్టు గ్రహించిన ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఫిలింనగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు


ఫిలింనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్, కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, ఎఫ్ఎన్‌సీసీ కార్యదర్శి మోహన్


ఫిలింనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్, నాయకులు నర్సింహ, వంశీకృష్ణ తదితరులు

ఎన్టీఆర్‌కు నివాళి

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాలలో గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయా ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో సముచితస్థానం కల్పించిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏబీ మోహన్‌రావు ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కృష్ణనగర్ లేబర్ అడ్డావద్ద నందమూరి రామకృష్ణ ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

(జోన్ బృందం, ఆంధ్రజ్యోతి)


కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు నరసింహారావు, కిలారి మనోహర్


ఎర్రగడ్డలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివ యాదవ్, శ్రీహరి తదితరులు


మన దేశం వేడుకలో అలనాటి నటులు

మన దేశం స్వర్ణోత్సవం

బంజారాహిల్స్: పద్మశ్రీ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో గురువారం ఎన్టీఆర్ నటించిన తొలి సినిమా 'మన దేశం' స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన దేశం సినీ నిర్మాత, నటి కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొని నందమూరి తారక రామారావు తో ఉన్న నాటి విషయాలను ఆమె గుర్తు చేసుకున్నారు. తెలుగు జాతి గర్వించదగ్గ నటుడు, ప్రజా సేవకుడు అయ్యారని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన చిత్ర దర్శకుడు అక్కినేని రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సినిమా రంగంలో, రాజకీయరంగంలో చెరగని ముద్ర వేశారని, ఇప్పటికీ ఎప్పటికీ ఎన్టీఆర్ పేరు తెలుగు వారందరూ తలుచుకునే విధంగా ఆయన నిలిచిపోయారని అన్నారు. ఫిలింనగర్ క్లబ్ అధ్యక్షుడు ఆది శేషగిరిరావు, నందమూరి మోహన కృష్ణ, ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, ఎన్టీఆర్ లిటరేచర్ సావనీర్ వెబ్‌సైట్ కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్, ఎమ్మెల్సీ రమణ, నిర్మాత ప్రసన్న కుమార్, భగీరథ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక శిబిరం


శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చింతల రామచంద్రారెడ్డి

ఖైరతాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం ఖైరతాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలను రిజిస్టర్ చేసుకునే ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. గ్రంథాలయ చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది స్థానికులు ముద్ర లోన్లు, జీరో బ్యాలన్స్ బ్యాంక్ ఖాతాలు, ఆయుష్మాన్ భారత్, ఆధార్ నమోదు, సవరణలు, ఉజ్వల గ్యాస్ కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ శిబిరాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాడి ప్యూటీ జీఎం ప్రఫుల్ల కుమార్ జనా ప్రారంభించి సేవలను వివరించారు. ఇందులో ప్రధాన మంత్రి మోదీ ప్రభుత్వ పథకాలపై చేసిన ప్రసంగాన్ని వీక్షించే ఏర్పాట్లు చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శిబిరాన్ని సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు ప్రేంరాజ్, వెంకటరెడ్డి, రామ్మోహన్‌రావు, నగేష్, ఆదర్శ్, వీణా మాధురి, లాల్ హీరా, వైద్యనాథ్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం దశాబ్ది ఉత్సవాలు


రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం దశాబ్ది ఉత్సవాల పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పంజాగుట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం దశాబ్ది ఉత్సవాలు, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, 2024 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 20న రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.సంగమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి దశాబ్ది ఉత్సవాల పోస్టరు, కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, మాజీ ఉప లోకాయుక్త జస్టిస్ ఎం.శివరత్నం, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తదితరులు హాజరు కానున్నట్టు తెలిపారు. ఈసమావేశంలో సెంట్రల్ కమిటీ సభ్యులు శివప్పా, శెట్టి శివకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్ పాటిల్, కోశాధికారి రాచప్ప,నాయకులు భరత్, సోమేశ్వర్, రఘు, మహేష్, పరమేశ్వర్, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రావణి, ప్రధాన కార్యదర్శి విద్యుత్ లత, అశ్విని పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటా


ఎన్‌సీసీ కెడెట్స్‌కు బ్యాండ్ పరికరాలు అందజేస్తున్న నవీన్‌యాదవ్

యూసుఫ్‌గూడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిరంతరం అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.నవీన్ యాదవ్ అన్నారు. శుక్రవారం పాఠశాలను సందర్శించిన ఆయన ప్రధానోపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలోని ఎన్‌సీసీ కెడెట్స్‌కు బ్యాండ్, వాటికి కావాల్సిన పరికరాలు, సౌండ్ బాక్సులు అందజేశారు. పాఠశాల వాచ్‌మన్, ఆయాలకు జీతాలు కూడా ఇస్తామని తెలిపారు. 30సంవత్సరాలుగా పాఠశాలకు ఎలాంటి అవసరం వచ్చినా సహాయం చేస్తూ వస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.పరమేశ్వరమ్మ, ఎన్‌సీసీ అధికారి పి.ప్రభాకర్, అధ్యాపకులు నర్సింహ, మహమ్మద్ ఆలీ, తబిత జాసన్, నాగరాజు, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

లేని తహసీల్దార్ పేరుతో కులధ్రువపత్రం

● డబుల్ బెడ్‌రూం కోసం ఫోర్జరీ చేసిన మహిళ
● తప్పును సరిదిద్దేందుకు జత చేసి మరోసారి దరఖాస్తు
● పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

మదీన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే డబుల్ బెడ్ రూం కోసం ఓ మహిళ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందినట్లు బహదూర్‌పురా మండల కార్యాలయం అధికారులు గుర్తించారు. అసలు లేని తహసీల్దార్ పేరుతో ధ్రువీకరణ పత్రం జారీ కావడంపై ఆశ్చర్యానికి గురయ్యారు.

దివాన్‌దేవిడి ప్రాంతానికి చెందిన శేఖర్ భార్య మంజుల(36)కు అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రభుత్వ డబుల్ బెడ్‌రూం మంజూరైంది. 2023 అక్టోబర్ 13వ తేదీన బహదూర్‌పురా మండల అధికారులు ఎస్సీ మాదిగ కులానికి చెందినట్లుగా జారీ చేసినట్లు కుల ధ్రువీకరణ పత్రం పొందింది. ఇల్లు అప్పగించేందుకు బల్దియా అధికారులు పత్రంలోని తప్పులను సరిదిద్ది కొత్తగా కావాలని సూచించారు. సదరు మహిళ అప్పటికే పొందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తూ మీ-సేవలో దరఖాస్తు చేసుకుంది. గురువారం దరఖాస్తును పరిశీలించిన తహసీల్దార్ చంద్రశేఖర్ షాక్‌కు గురయ్యారు. జారీ చేసిన సర్టిఫికెట్‌పై తహసీల్దార్ పేరు జానకిగా ఉంది. అసలు జానకి పేరుతో ఏ తహసీల్దార్ లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాన్ని ఎలా పొందావని మహిళను అధికారులు ప్రశ్నించారు. తన భర్త తెచ్చాడని, నూర్‌ఖాన్ బజార్‌లోని ఓ మీ-సేవ సెంటర్ నిర్వాహకులు ఇప్పించారని చెప్పింది. విస్మయానికి గురైన తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంకా ఎన్ని ఫోర్జరీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. మీ-సేవ సెంటర్ నిర్వాహకుడి పాత్ర ఏంటి అనే వివరాలు పోలీసు దర్యాప్తులో తేలుతాయని బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

చేనేత, పట్టు ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభం


ప్రదర్శనను ప్రారంభిస్తున్న నేపథ్య గాయనీ లక్ష్మీ గాయత్రి

బంజారాహిల్స్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుజరాత్ నేతృత్వంలో శ్రీనగర్ కాలనీలోని సత్య సాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ టూ హ్యాండ్ - సంప్రదాయ చేనేత పట్టు ఉత్పత్తుల వస్త్ర ప్రదర్శనను గురువారం నేపథ్య గాయని, జీ సరిగమప ఫేమ్ లక్ష్మీ గాయత్రి వేదాంతం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సిల్క్ హ్యాండ్ లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, నేటికీ వాటిపై వన్నె తగ్గలేదని అన్నారు. దేశంలోని పలు నగరాల చేనేత కారులు ఒకే వేదికలో హ్యాండ్ లూమ్ వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం అభినందనీయమని ఆమె అన్నారు. నిర్వాహకులు జయేష్ మాట్లాడుతూ, ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 50 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు వివరించారు.


● ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను గురువారం జ్యోతి రావు పూలే ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న తెలంగాణ వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ రాజు, వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య
- యూసుఫ్‌గూడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి)

● **పరామర్శ**


బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో గుండె సంబంధించిన శస్త్ర చికిత్స పొందిన మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌ను గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య గురించి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు.
- హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి)


● ఈనెల 22న అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని స్వచ్ఛ అభియాన్‌లో భాగంగా గురువారం బోరబండలోని వీరహనుమాన్, రామాలయం, శివాలయాలను బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, నాయకులు దర్శనం నగేశ్, రాజ్‌కుమార్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.
- బోరబండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి)


● జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 హెల్త్, శానిటేషన్ మెడికల్ ఆఫీసర్ రవికుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి బొకె అందజేసి శాలువాతో సత్కరిస్తున్న రాజ్‌నగర్ వెల్ఫేర్ అధ్యక్షుడు జై భీమ్ యాదగిరి, ఎస్సార్టీ నగర్ నాయకులు పవనం శివశంకర్
- బోరబండ, (ఆంధ్రజ్యోతి)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. 11 కేవీ ఓబుల్ రెడ్డి స్కూల్, కలెక్టర్ బంగ్లా ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, 11 కేవీ సెలబ్రేషన్ హోటల్, సీఆర్పీఎఫ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు, 11 కేవీ ఐఏఏ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, 11 కేవీ హైలం కాలనీ, చిరాణ్ ప్యాలెస్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

● గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. 11 కేవీ సారధి నగర్, ఆర్‌బీఐ క్వార్టర్స్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 11 కేవీ సీతారామయ్య టవర్స్, ప్రకాష్ నగర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

● సైఫాబాద్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు. 11 కేవీ ఆదర్శ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 11 కేవీ కపాడియా లైన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

రేపు యూఎస్ఏ అడ్మిషన్ డే

పంజాగుట్ట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థినీ, విద్యార్థుల కోసం ఈనెల 20న సోమాజిగూడలోని సంస్థ కార్యాలయంలో ఉచితంగా యుఎస్ఏ అడ్మిషన్ డేను నిర్వహిస్తున్నామని యూని ఎక్స్ పర్ట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆపరేషన్ విభాగం హెడ్ ఉమా గురువారం తెలిపారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో పాల్గొనే విద్యార్థులు, తల్లిదండ్రులు వీసా రిక్రూట్మెంట్స్, అడ్మిషన్ రిక్రూట్మెంట్స్, స్కాలర్షిప్ ఆప్షన్స్, లాంగర్ స్టే బ్యాక్ ఆప్షన్స్, ట్రావెల్ అప్డేట్స్, తదితర అంశాలపై నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చించి, తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆమె తెలిపారు. వివరాల కోసం 99123 28645 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మారేడుపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని వన నివాసం వద్ద ఎస్‌ఆర్‌నగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి కృషి చేయాలని ఎస్‌ఆర్‌నగర్ అసోసియేషన్ ప్రతినిధులను సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, డేవిడ్, వివేకానంద్, రోజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, మణికుమార్ పాల్గొన్నారు.

ప్రమాద స్థలం పరిశీలన

రాంగోపాల్‌పేట్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని వెంగళరావునగర్‌కు చెందిన ఝాన్సీ ఇంట్లో ప్రమాదవశాత్తు కుక్కర్ పేలి ఇంటి పైకప్పు రేకులు ధ్వంసం అయ్యాయి. విషయం తెలిసుకున్న మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బాధితురాలి ఇంటికి వెళ్లి ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింగం సతీష్, ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు కొశికె కిషోర్‌కుమార్, మల్లేష్, కస్తూరి, రాజు, సాయినాథ్ పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న మహిళలతో కావ్యకిషన్‌రెడ్డి, కార్పొరేటర్ కొంతం దీపిక

ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రెజిమెంటల్‌బజార్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మహిళలు ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఏబీవీ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ కావ్యకిషన్‌రెడ్డి అన్నారు. గురువారం మోండా మార్కెట్‌లో ఉన్న ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కావ్యకిషన్ రెడ్డి సందర్శించారు. శిక్షణ పొందుతున్న మహిళలు, శిక్షణ ఇస్తున్న అధ్యాపకులతో మాట్లాడారు. కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న కార్మిక శాఖ ఆధ్వర్యంలో వైద్య బృందం

వైద్య శిబిరాన్ని..

అడ్డగుట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రుద్రవీణా మహిళా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎస్. శోభ సూచించారు. గురువారం సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజనల్‌లోని శాస్త్రీనగర్ బస్తీలో రుద్రవీణా మహిళా అసోసియేషన్ కార్యాలయంలో కార్మికశాఖ ఆధ్వర్యంలో వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 35మంది వైద్యం చేయించుకున్నారు. ప్రజల వద్దకు వచ్చే ఇలాంటి సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 45రకాల వైద్య పరీక్షలు చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నాగరాణి, జ్యోతి, లక్ష్మి, రాధిక, రాజు, సరోజ పాల్గొన్నారు.



డ్రాప్ ఔట్ సమాచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గురుకుల హాస్టల్ ప్రతినిధులు

డ్రాప్ ఔట్ పిల్లలుంటే సమాచారం ఇవ్వండి

అడ్డగుట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో డ్రాప్ ఔట్ పిల్లలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని రాష్ట్ర రెసిడెన్సియల్ గురుకుల హాస్టల్ టీచర్ దివ్య సూచించారు. గురువారం అడ్డగుట్టలోని రుద్రవీణా మహిళా సంఘం కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రాప్ ఔట్ పిల్లల కోసం ప్రత్యేక వెబ్ సైట్ ఏర్పాటు చేశారని, గురుకుల హాస్టల్‌లో చేరాలనుకుంటే ఆన్‌లైన్ ద్వార నమోదు చేసుకుని పరీక్షలు రాసిన అనంతరం గురుకుల హాస్టల్‌లో చేరవచ్చన్నారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు డ్రాప్‌ఔట్ పిల్లలు ఉంటే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9381287959 (శోభ) నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు.

అవయవ దానం



అన్నారపు శంకర్(ఫైల్)

రాంగోపాల్‌పేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్ద మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎందరికో ఆదర్శప్రాయమైంది. హైదరాబాద్ బొకెగూడకు చెందిన అన్నారపు శంకర్(61) అనారోగ్యంతో స్పృహ తప్పి పడిపోవడంతో స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెదడులో రక్తం గడ్డకట్టిందని వైద్య పరీక్షల్లో గుర్తించిన వైద్యులు రెండు రోజులు శ్రమించి వైద్యం చేసినప్పటికీ గురువారం శంకర్ బ్రెయిన్ డెడ్ అయ్యి మృతిచెందాడు. అనంతరం అవయవ దానం గురించి మృతుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు ఆస్పత్రిలోని అవయవదాన సమన్వయ కర్తలు అవగాహన కల్పించారు. దీంతో శంకర్ భార్య లలిత, నలుగురు కూతుర్లు, ఇద్దరు కుమారుల అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలను దానం చేశారు. అనంతరం జీవన్‌దాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానల్ ద్వారా అవసరం ఉన్న చోటికి ఆ అవయవాలను తరలించారు.



స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం తార్నాకలోని గణపతి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ నాయకులు రవిప్రకాష్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, జమ్మికుంట వేణు, ప్రమోద్, భిక్షపతి, కృష్ణగౌడ్, రాము పాల్గొన్నారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి



చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గౌరిశంకర్‌యాదవ్ తదితరులు



మెట్టుగూడ టీడీపీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మహేందర్‌యాదవ్ తదితరులు

ఎన్టీఆర్‌కు నివాళి

బేగంపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు, టీటీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో బేగంపేట రసూల్‌పురలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన అమరజ్యోతి ర్యాలీని నందమూరి రామకృష్ణ, నందమూరి సుహాసినీలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అమరజ్యోతి ర్యాలీ నెక్లెస్ రోడ్డులోని ఎన్టీఆర్ ఘాట్‌కు వెళ్లింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన, టీడీపీ నేతలు కానూరి జయశ్రీ, రాజు, సోమలింగం, మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

చిలకలగూడ : ఎన్టీఆర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ర్యాల మహేందర్‌యాదవ్ పేర్కొన్నారు. మెట్టుగూడ టీడీపీ కార్యాలయం వద్ద గురువారం ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ జెండా ఆవిష్కరించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. శ్రీనివాస్, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు తడక వినోద్‌కుమార్, బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, శివప్రసాద్, నరసింగ్, మురళి, మల్లేష్ పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్ : ఎన్టీఆర్ 28వ వర్ధంతి మోండా మార్కెట్ డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో టీడీపీ మల్కాజిగిరి పార్లమెంట్ జనరల్ సెక్రటరీ గౌరి శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్‌కే బాబు, జయరాజ్, నాందేవ్, నర్సింగరావు, అశోక్‌యాదవ్, ఫణీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుపల్లి : పికెట్ జేబీఎస్ చౌరస్తాలో గల ఎన్టీఆర్ విగ్రహానికి కంటోన్మెంట్ నాలుగో వార్డు టీడీపీ అధ్యక్షుడు డీఆర్ శ్రీనివాస్, గోపి, అశోక్ యాదవ్, జయరాజ్, ఆనంద్ కుమార్, కైలాష్‌గౌడ్ నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ నాలుగో వార్డు టీడీపీ అధ్యక్షుడు డీఆర్ శ్రీనివాస్, గోపి, అశోక్‌యాదవ్, జయరాజ్, ఆనంద్‌కుమార్, కైలాష్‌గౌడ్

గాంధీ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి వైద్యసామగ్రి అందజేత



గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్. రాజారావు, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగ హెచ్‌ఓడి డాక్టర్.శ్రవణ్‌కుమార్‌లకు గ్యాస్ట్రో ఎంటరాలజీ సామగ్రిని అందజేస్తున్న డాక్టర్.దివేశ్ అనిరెడ్డి

పద్మారావునగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గాంధీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, అమెరికా అధ్యక్షుడు, ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజి వైద్యుడు, డాక్టర్. దివేశ్ అనిరెడ్డి గాంధీ ఆస్పత్రిలోని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి రూ.50లక్షల విలువైన వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.రాజారావు, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం హెచ్‌ఓడి పి.శ్రవణ్‌కుమార్‌లు ఆయనను సత్కరించి, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్.రాజారావు మాట్లాడుతూ తాను విద్యనభ్యసించిన కళాశాల, ఆస్పత్రికి విలువైన వైద్య సామగ్రిని అందజేసిన దివేశ్ అనిరెడ్డి పూర్వ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. డాక్టర్. శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో అనేక మార్లు ఇండియాకు వస్తున్న సమయంలో ఆయన తనను ఫోన్లో గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి అవసరమైన సామగ్రి వివరాలను అడిగి తెలుసుకొన్నారని, అమెరికాలో కొనుగోలు చేసిన సామగ్రిని విమానంలో తీసుకువచ్చి, కస్టమ్స్ సుంకం చెల్లించి, గాంధీకి తీసుకువచ్చి అందించడం అభినందనీయమని అన్నారు. ఈ తరానికి చెందిన వైద్యులు ఆయనను ఆదర్శంగా తీసుకొని, తాము సంపాదించిన దానిలో కొంత సమాజ హితం కోసం వెచ్చించాలని అన్నారు. దివేశ్ అనిరెడ్డి మాట్లాడుతూ తాను అమెరికా వెళ్లాక సేవాభావం కలిగిన మిత్రులతో కలిసి తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేసి, విద్య, వైద్యం, వ్యవసాయం, నైపుణ్య శిక్షణ వంటి అనేక రంగాలలో తాము తెలంగాణలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్.జయకృష్ణ, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినీల్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్షత్రియులు అన్ని రంగాల్లో రాణించాలి

● డాక్టర్ విశ్వనాథ్ రవీందర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ విశ్వనాథ్ రవీందర్

రాంగోపాల్‌పేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : క్షత్రియ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఆర్టీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ ఆకాంక్షించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సోమవంశీయ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి/పట్కార్) ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సమాజ్ రాష్ట్ర అధ్యక్షులైన విశ్వనాథ్ రవీందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా క్షత్రియ సమాజ్ అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం కృషి చేస్తూ, 'మిషన్ ఉడాన్' ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పేదరికం, నిరక్షరాస్యత రూపు మాపడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ క్షత్రియ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంకు విష్ణు, ఉపాధ్యక్షులు నాగూరావు నామాజీ, పూజారి రాజేశ్వర్, కోశాధికారి దినేష్ వైద్య, రాష్ట్ర కార్యనిర్వాహణాధికారి ఖాందేష్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు విశ్వనాథ్ నర్సింహారావు, గోరఖ్ శివకుమార్, చవాన్ భరత్, డాక్టర్ ఆనందరావు మెంగ్జి, సభ్యులు ఓంకార్ ప్రభు, కామేశ్వర్, టంకు శ్యాంరావు, రాష్ట్ర యూత్ కమిటీ సలహాదారులు విశ్వనాథ్ బాల్‌రాజ్, అరవింద్, విశాల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే లోకో పైలట్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించండి

● సంచాలన్ భవన్ వద్ద ఉద్యోగుల నిరసన



రైల్వే సంచాలన్ భవన్ వద్ద ధర్నా చేస్తున్న రైల్వే లోకో పైలట్ ఉద్యోగులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైల్వే రంగంలో పనిచేస్తున్న రన్నింగ్ లోకోపైలట్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించడంలో రైల్వే బోర్డు నిర్లక్ష్యం చూపుతుందని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సికింద్రాబాద్ జోన్ జోనల్ కార్యదర్శి జిలానీ పాషా అన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే సంచాలన్ భవన్ వద్ద రైల్వే రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే రంగంలో లోకో పైలట్ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించడంలో రైల్వే బోర్డు నిర్లక్ష్యం చూపుతుందన్నారు. హైపవర్ కమిటీ ఇచ్చిన అనేక రికమెండేషన్స్‌ను రైల్వే బోర్డు కొన్నింటిని ఒప్పుకుని కొన్ని అమలు చేయకుండా మరికొన్ని 2020 నుంచి ఇంప్లిమెంట్ చేస్తామని హామీ ఇచ్చినా వాటిని కూడా గాలికొదిలేసిందన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు రైల్వే ఉద్యోగులు ధర్నాకు దిగడం జరిగిందన్నారు. హెచ్‌పీసీ ప్రకారం 8గంటల వరకు డ్యూటీల పరిమితి ఇవ్వాలి, హెచ్‌ఓఈఆర్ ప్రకారం 46గంటల పీఆర్ వారం విశ్రాంతి డ్యూటీ గంటలు మంజూరు చేయాలి, రెండు రాత్రులకు నిరంతరం రాత్రి విధులను పరిమితి చేయాలి, రైల్వేను ప్రవేటీకరణ ఆపాలన్నారు. 14(11) రూల్ ప్రకారం ఉద్యోగ తొలగింపు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. లోకో రన్నింగ్ స్టాఫ్‌ల్లో అన్ని కేడర్‌లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు సిరి కుమార్, సభ్యులు తిరుపతిరెడ్డి, అనిష్‌కుమార్, మోహన్, రవికాంత్ పాల్గొన్నారు.

అభయ హస్తం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి



కార్యకర్తల సమావేశంలో సీపీఐ నేతలు

అడ్డగుట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరపాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లలో ఏ సంక్షేమ ఫలాలను నిజమైన పేద వర్గాలకు అందించలేకపోయిందన్నారు. కేవలం బీఆర్ఎస్ నాయకులకు పైరవీ కారులకు మాత్రమే అందాయన్నారు. సంక్షేమ పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా వ్యవహరించకుండా ఎంపికలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా పథకాల ఎంపిక జరపాలని నిజమైన పేద వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ అడ్డగుట్ట డివిజన్ కార్యదర్శి పాకాల యాదగిరి, సహాయ కార్యదర్శి రషీద్, ఖదీర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో దక్షిణ మధ్య రైల్వే

● జనరల్ మేనేజర్ ఎ.కె.జైన్



ప్రసంగిస్తున్న జీఎం ఎకె. జైన్

చిలకలగూడ, జనవరి 18(ఆంధ్రజ్యోతి) : కార్మికులు, ఉద్యోగుల సహకారంతో దక్షిణ మధ్య రైల్వే అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్, న్యూబోయిన్‌గూడ, రైల్ కళారంగ్‌లో దమ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ 32వ సర్వసభ్య సమావేశాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సమావేశాల్లో పలు నిర్ణయాలు చేపట్టనున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జీఎం ఎకె. జైన్ జ్యోతి ప్రజ్వలన గావించి అనంతరం ప్రసంగిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు, వారి సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైల్వే బోర్డు ఉత్తమ ప్రతిభకి రెండు జాతీయ స్థాయి అవార్డులు అందజేసిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 10వేల నూతన ఉద్యోగ నియామకాలు, మరో 4వేల నియామకాలు త్వరలో చేపట్టనున్నట్లు, 227 కారుణ్య నియామకాలు, 64 వేల ఆరోగ్య కార్డులు ఉద్యోగులకి అందజేసినట్లు 8500 పదోన్నతులు కల్పించినట్లు 1750మంది ఉద్యోగుల సెటిల్‌మెంట్లు కావించినట్లు వివరించారు. యాజమాన్యం, కార్మికులు మధ్య సత్సంబంధాలతో అన్ని రంగాల్లో ప్రగతి సాధ్యమైందని తెలిపారు. సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఆల్‌ఇండియా రైల్వేమన్ ఫెడరేషన్, దమ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి మర్రి రాఘవయ్య మాట్లాడుతూ రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీచేయాలి. పని గంటలు తగ్గించాలి. రన్నింగ్ స్టాఫ్‌కి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, కనీస వేతనం రూ.32,500లుగా నిర్ణయించాలని, రైల్వే ఆస్పత్రుల్లో డాక్టర్లు, పారా మెడికల్ పోస్టులు వెంటనే భర్తీ చేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. న్యూపెన్షన్ రద్దుకి అవసరమైతే దేశవ్యాప్త సమ్మెకి సమావేశాల్లో ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పాత పద్ధతిలో పెన్షన్ అమలుకి పోరాటం ఆగదని హెచ్చరించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి రాఘవయ్య చేపడుతున్న చర్యలను కనియాడారు. దమ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీధర్, సంఘ్ అధ్యక్షుడు ఎ. ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదం సంతోష్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీలు భరణి భానుప్రసాద్, రుద్రారెడ్డి మీడియా ప్రతినిధి షేక్ రవూఫ్, జాయింట్ జనరల్ సెక్రటరీలు మోహనరావు, రాజగోపాల్, కోశాధికారి శర్మ, 900మంది ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రిని కలిసిన దళిత జర్నలిస్టులు

దళిత జర్నలిస్టులకు ప్రెస్ అకాడమీ చైర్మన్ ఇవ్వాలి

అడ్డగుట్ట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రెస్ అకాడమీ చైర్మన్ దళిత జర్నలిస్టులకు ఇవ్వాలని దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాను అన్నారు. గురువారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టీ విక్రమార్క, ఎమ్మెల్యే వివేక్‌లను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలు సమర్పించామన్నారు. సానుకూలంగా స్పందించిన బట్టీ, వివేక్‌లు మాట్లాడుతూ గత ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరించారని మన ప్రభుత్వంలో జర్నలిస్టులకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రజా భవన్‌లో మంత్రులను కలిసిన వారిలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేవిడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రాజు, జగత్ ప్రకాశ్, రత్నకుమార్, రాష్ట్ర నాయకుడు పెద్దిగారి స్వామి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు ధనుష్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదగిరి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల ఎల్లేష్, ఉపాధ్యక్షుడు దొమ్మాటి శివకుమార్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ ఇంట్లో ప్రమాదకర మత్తు ఇంజక్షన్లు

● పోలీసుల దాడుల్లో స్వాధీనం

● కువైట్ పారిపోయిన వైద్యుడు

రాజేంద్రనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నార్కొటిక్ బ్యూరో, రాజేంద్రనగర్ ఎస్ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు గురువారం సంయుక్తంగా ఆసిఫ్‌నగర్‌లోని ఓ ఇంటిపై దాడులు నిర్వహించి అధిక మత్తునిచ్చే 57ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ ఓ ఆస్పత్రిలో అనస్తీషియన్. సర్జరీల సందర్భంగా మత్తు కోసం ఇచ్చే ఫెంటానిల్ మత్తు ఇంజక్షన్‌లను బయట మార్కెట్‌లో రూ. 17,500కు విక్రయిస్తున్నాడు. ఇవి హెరాయిన్ కంటే 50శాతం ఎక్కువ, మార్ఫిన్ కంటే మరింత ఎక్కువ ప్రమాదకరమని పోలీసులు తెలిపారు. యాప్ ద్వారా బయట వ్యక్తులకు డాక్టర్ అశన్ ముస్తాఫా ఖాన్ విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు నిఘా పెట్టారు. ప్రతీ రోజు ఓ డెలివరీ యాప్ పార్సిల్ ద్వారా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గురువారం అతడి ఇంటిపై దాడి చేయగా డాక్టర్ కువైట్ పారిపోయినట్లు గుర్తించారు. అతడి భార్య లుబ్నా నజీబ్ ఖాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 57మత్తు ఇంజక్షన్లు, రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 6 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ వస్తే అతడు ఎవరెవరికి మత్తు ఇంజక్షన్‌లు విక్రయిస్తున్నాడనే వివరాలు తెలిసే అవకాశం ఉందని తెలిపారు.

లేని తహసీల్దార్ పేరుతో కులధ్రువ పత్రం

● డబుల్ బెడ్‌రూం కోసం ఫోర్జరీ చేసిన మహిళ

● తప్పును సరిదిద్దేందుకు జత చేసి మరోసారి దరఖాస్తు

● పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

మదీన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే డబుల్ బెడ్ రూమ్ కోసం ఓ మహిళ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం పొందినట్లు బహదూర్‌పురా మండల కార్యాలయం అధికారులు గుర్తించారు. అసలు లేని తహసీల్దార్ పేరుతో ధ్రువీకరణ పత్రం జారీ కావడంపై ఆశ్చర్యానికి గురయ్యారు.

దివాన్‌దేవిడి ప్రాంతానికి చెందిన శేఖర్ భార్య మంజుల(36)కు అబ్దుల్లాపూర్‌మెట్‌లో ప్రభుత్వ డబుల్ బెడ్‌రూమ్ మంజూరైంది. 2023 అక్టోబర్ 13వ తేదీన బహదూర్‌పురా మండల అధికారులు ఎస్సీ మాదిగ కులానికి చెందినట్లుగా జారీ చేసినట్లు కుల ధ్రువీకరణ పత్రం పొందింది. ఇల్లు అప్పగించేందుకు బల్దియా అధికారులు పత్రంలోని తప్పులను సరిదిద్ది కొత్తగా కావాలని సూచించారు. సదరు మహిళ అప్పటికే పొందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తూ మీ-సేవలో దరఖాస్తు చేసుకుంది. గురువారం దరఖాస్తును పరిశీలించిన తహసీల్దార్ చంద్రశేఖర్ షాక్‌కు గురయ్యారు. జారీ చేసిన సర్టిఫికెట్‌పై తహసీల్దార్ పేరు జానకిగా ఉంది. అసలు జానకి పేరుతో ఏ తహసీల్దార్ లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాన్ని ఎలా పొందావని మహిళను అధికారులు ప్రశ్నించారు. తన భర్త తెచ్చాడని, నూర్‌ఖాన్ బజార్‌లోని ఓ మీ-సేవ సెంటర్ నిర్వాహకులు ఇప్పించారని చెప్పింది. విస్మయానికి గురైన తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంకా ఎన్ని ఫోర్జరీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. మీ-సేవ సెంటర్ నిర్వాహకుడి పాత్ర ఏంటి అనే వివరాలు పోలీసు దర్యాప్తులో తేలుతాయని బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు.

నేడు గిరిజన సంస్కృతి పరిరక్షణపై సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆద్యకళ మ్యూజియం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10గంటలకు నాంపల్లి, తెలుగు వర్సిటీలోని సమావేశ మందిరంలో 'జానపద, గిరిజన కళలు, సంస్కృతి-అధ్యయనం-పరిరక్షణ' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు ఆచార్య జయధీర్ తిరుమలరావు తెలిపారు. సదస్సులో మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఫలక్‌నుమా రైలులో వ్యక్తి మృతదేహం



రైలులో లభ్యమైన వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైలులో బాత్‌రూంలో పడి ఉన్న మృతదేహాన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఉత్తమ్ లోహర్(28) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్‌కు చేరుకుంది. ఆ రైలు బాత్‌రూంలో వ్యక్తి మృతిచెంది ఉన్నాడని సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.